ప్రజాశక్తి
బుధవారం 17 డిసెంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గోవాడ చెరుకు.. సంకిలికే..!



బుచ్చయ్యపేట కాటాలో చెరుకు లోడింగ్ చేస్తున్న కార్మికులు

- కాటాల వద్ద ఆ ఫ్యాక్టరీ సిబ్బంది
- ధర తగ్గడంతో రైతుల ఆందోళన
- గిట్టుబాటుకాక ఇబ్బందులు

ప్రజాశక్తి – బుచ్చయ్యపేట

జిల్లాలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మూతపడినట్టేనా ? అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఈ ఫ్యాక్టరీపై కూటమి ప్రభుత్వం తన ఎన్నికల హామీని తుంగలో తొక్కింది. ఇక్కడి చక్కెర కర్మాగారాన్ని మూసివేసి, రైతులు పండించిన చెరుకును శ్రీకాకుళం జిల్లాలోని సంకిలి చక్కెర కర్మగారానికి సరఫరా చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఒకప్పుడు లాభాల బాటలో నడిచిన గోవాడ చక్కెర కర్మాగారాన్ని మూసివేయాలన్న తలంపును జీర్ణించుకోలేకపోతున్నారు.

గోవాడ చక్కెర కర్మాగారంలో సుమారు 24 వేల మంది సభ్యులు ఉన్నారు. వీరు పండించిన చెరుకును చక్కెర కర్మాగారం పరిధిలోగల 20 కేంద్రాల ద్వారా సరఫరా చేసేవారు. అప్పుడు గోవాడకు బదులు సంకిలికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. పలు చెరుకు కాటాల ద్వారా చెరుకును సంకిలి చక్కెర కర్మాగార సిబ్బంది సేకరిస్తున్నారు. చెల్లించే ధర విషయంలో వ్యత్యాసం ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది గోవాడ చక్కర కర్మాగారం ద్వారా టన్ను ఒక్కంటికి రూ.3151 రూపాయలు ప్రకటించగా, ఈ ఏడాది సంకిలి ఫ్యాక్టరీ వారు మాత్రం రవాణా ఛార్జీలు మినహాయించి రూ.2800 చెల్లిస్తామని తెలిపారు. అది రెండు వారాలకు ఒకసారి మాత్రమే.

గత ఏడాది కంటే ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వ్యవసాయ ఖర్చులు పెరగడం, ధర పెరుగుతుందన్న క్రమంలో గోవాడ చక్కెర కర్మాగారం తెరుచుకోకపోవడం వంటి కారణాలతో చెరుకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో సంకిలి యాజమాన్యం అడిగిన ధరకే చెరుకును సరఫరా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.



కళారూపాలతో ఆకట్టుకున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కార్మిక వర్గ చైతన్యాన్ని పట్టిచూపిన నాటికలు

కార్మిక వర్గంలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని రగిలించే లక్ష్యంతో సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని వీటిని ఏర్పాటు చేశారు. మహాసభ జయప్రదం కోరుతూ కళాభారతి రోడ్డులో నిర్వహించిన ఈ కళా ప్రదర్శనలు అందరినీ ఆకట్టు కున్నాయి. 110 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. డ్యాన్సులు, సందేశాత్మక స్కిట్లు, కోలాటం ప్రదర్శించ బడ్డాయి. అభ్యుదయ గీతాలు, దేశభక్తియుత డ్యాన్సులు, సామాజిక చైతన్యాన్ని కలిగించే నాటికలు ఉత్తేజం నింపాయి. శ్రామిక మహిళలు మహిళా చైతన్యాన్ని ప్రతిబింబించే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీతారత్నం సంధానకర్తగా వ్యవహరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.మణి, నాయకులు కృష్ణారావు మాట్లాడారు.

స్టీల్ కార్మికుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 4లో..

రేపు విశాఖలో పెన్షన్ అదాలత్

▶ వార్త 2లో..

ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

▶ వార్త 8లో..

టి20 సిరీస్‌కు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు

ప్రజాశక్తి– ఎంవిపి. కాలనీ: భారత్–శ్రీలంక మహిళల టి20 అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం విశాఖపట్నంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం జరిగిన కీలక ప్రణాళికా సమావేశంలో, జిల్లా యంత్రాంగం, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారులు భద్రత, టికెటింగ్ వసతుల అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, నేతృత్వంలో డీసీపీలు ప్రశాంతి, మణికంఠ, సమక్షంలో భద్రతా అంశాలపై చర్చ జరిగింది. డిజిటల్ ఎం–టికెట్లు, ఈ–టికెట్లు ఫిజికల్ టికెట్లు సహా బహుళ టికెటింగ్ పద్ధతులను అందుబాటులోకి తెస్తున్నారు. టికెట్ కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు భద్రత కల్పిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాలు ఇతర కీలక ప్రదేశాల్లో నిరంతర నిఘా కోసం సీసీటివి వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో లేదా సమాచార మార్పిడి కోసం కేంద్రీకత పబ్లిక్ అడ్రెస్ వ్యవస్థను మెరుగుపరిచారు. స్టేడియంలోకి వాటర్ బాటిళ్లను అనుమతించరు. అయితే తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా ఎసిఎ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గిరీష్ డాంగ్రే, జివిఎంసి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడుకు మ్యాచ్ ఏర్పాట్ల వివరాలు వివరించారు. ఈ సిరీస్ డిసెంబర్ 21, 23 తేదీల్లో జరగనుందన్నారు. రెండు జట్లు ఈ నెల 17న విశాఖపట్నం చేరుకుంటాయి. భారత జట్టు నోవోటెల్‌లో, మిగతా 2లో..

ఏవియేషన్ ఎడ్యు సిటీ ప్రపంచానికే ఆదర్శం

జిఎంఆర్ - మాన్సాస్ ఎంఒయు నేపథ్యంలో అశోక్ గజపతి, రామ్మోహన్ నాయుడు, లోకేష్



మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, వేదికపై రామ్మోహన్ నాయుడు, లోకేష్, అయ్యన్న

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిఎంఆర్ – మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శంగా నిలువనుందని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ సివిల్ ఏవియేషన్ వర్క్ ఫోర్స్‌లో 25 శాతం తెలుగువారు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. మాన్సాస్ ట్రస్ట్ సహకారంతో భోగాపురం సమీపంలోని భీమిలి మండలం అన్నవరం వద్ద 136.63 ఎకరాల్లో జిఎంఆర్ సంస్థ అభివృద్ధి చేయనున్న జిఎంఆర్ – మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్ట్‌కు మంగళవారం అంకురార్పణ జరిగింది. సదరు సంస్థలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నాయి. విశాఖ రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు మాట్లాడారు. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో షార్ ఉండగా, ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ ఎడ్యూ సిటీ ఏర్పాటు చేసి ఒక సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయగలిగితే, ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పునరుద్ధరణలో మంత్రి నారా లోకేష్ అభినందనీయమైన పాత్ర పోషిస్తున్నారని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మాన్సాస్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. విద్యతో పాటు ఉద్యోగోపయోగ నైపుణ్యాలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో ఒక ఆధునిక స్కిల్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఏవియేషన్ ఎడ్యు సిటీ ప్రపంచానికే ఆదర్శం

ఆధారిత ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. ఇది చారిత్రాత్మక దినమని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన అధ్యాయమని కేంద్ర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. పౌర విమానయాన రంగంలో ప్రతి సంవత్సరం సగటున 12 శాతం వృద్ధి రేటు నమోదవుతోందన్నారు. రాష్ట్ర ఐటి, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా మిసైల్స్ టెక్నాలజీ, జిపిఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను సమన్వయంతో వినియోగిస్తూ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఐటి రంగానికి విశేష ప్రాధాన్యం ఇస్తూ, అన్ని ప్రముఖ ఐటి కంపెనీలు భీమిలి ప్రాంతానికి తరలివస్తుండటం అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు మహర్దశ వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు కోసం విలువైన భూములను అందించిన ఘనత అశోక్ గజపతి రాజుదే అని కొనియాడారు.

కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిఎంఆర్ సంస్థ నిర్వాహకులు రాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇతర ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు, కోళ్ల లలిత కుమారి, లోకం మాధవి, కోండ్రు మురళీమోహన్, నడుపూరి ఈశ్వరరావు, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, రఘురాజు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టి20 సిరీస్‌కు ఏర్పాట్లు పూర్తి

శ్రీలంక జట్టు ఫోర్ పాయింట్స్ హోటల్‌లో బసచేయనున్నాయి. ఈ సిరీస్ ఒక బెంచ్‌మార్క్‌గా నిలిచేలా ప్రపంచస్థాయి సౌకర్యాలు, అతిథి సత్కారాన్ని అందించడానికి కషి చేస్తున్నామని డాంగ్రే తెలిపారు.

ఐదుగురు ఎస్ఐల సరెండర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పరిపాలనా కారణాల దృష్ట్యా విశాఖ నగరంలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్ఐలను తక్షణమే విశాఖపట్నం రేంజ్‌కు సరెండర్ చేస్తూ విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం సరెండర్ చేయబడిన వారిలో త్రీ టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎమ్‌డి.సల్మాన్ బైగ్, పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోండెల ప్రసాద్, ఫోర్త్ టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ.విజయ్ కుమార్, టూ టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నిమ్మకాయల సునీల్, సిటీ టాస్క్ ఫోర్స్ విభాగం ఎస్ఐ ఎం.భరత్ కుమార్ రాజు ఉన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అనంతరం తక్షణమే వారిని విధుల నుంచి రిలీవ్ చేయాలని విశాఖపట్నం నగర పరిధిలోని సంబంధిత ఇన్‌స్పెక్టర్లు, ఎసిపిలను ఉత్తర్వుల్లో ఆదేశించారు. రిలీవ్ అయిన వెంటనే వారు విశాఖపట్నం రేంజ్ డిఐజికి రిపోర్టు చేయాలని సూచించారు.

మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నం టిడిపి కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి అర్జీలు స్వీకరించారు. విశాఖపట్నం కంచరపాలెం ఓల్డ్ ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలని లంకిరెడ్డి సతీశ్వరరెడ్డి కోరారు.

కోనసీమ జిల్లా ఐ. పోలవ రం మండలం గుత్తెనదీవిలో తన 20 సెంట్ల భూమిని ఆక్రమణకు గురైందని తగిన న్యాయం చేయాలని గాలి దుర్గమ్మ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిం చాలని బాధితులు మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించారు. 2008లో విసిఐసి ఫేజ్-1లో భాగంగా పరిశ్రమల అభివృద్ధి కోసం ఎపిఐఐసి భూసేకరణ చేసి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పునరావాసం కల్పించలేదని మంత్రి దష్టికి తీసుకువచ్చారు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో విశాఖ ఎపిహెచ్‌బి లే అవుట్‌లోని తమ 70వ నెంబర్ ఫ్లాట్‌ను ఆక్రమించారని, విచారించి న్యాయం చేయాలని ఎస్.వెంకటలావణ్య కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

కార్పొరేషన్ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నాహాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: త్వరలో జరగనున్న జివిఎంసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే విషయంపై చర్చ చేయటం జరిగిందని, దక్షిణ నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షులు కె.వి.విసూర్యనారాయణ తెలిపారు. మంగళవారం దక్షిణ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుల సమావేశం సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలోనే పార్టీ వార్డు కమిటీలు ఏర్పాటు చేస్తామని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి జరుగుతోందన్నారు.

పార్టీ ఆధ్వర్యంలో ఈ నెలలో జరిగే కార్యక్రమాల నిర్వహణకు సమావేశంలో ప్రణాళికలు రచించారు. సమావేశంలో పార్టీ ఎస్సి సెల్ సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు, మైనార్టీ నాయకులు హర్షద్ బాషా, వార్డు అధ్యక్షులు సత్యనారాయణ, ఈశ్వరరావు, కాకర అప్పారావు, 28వ వార్డు అధ్యక్షులు కనకరాజు, షేర్ ఆలీ, మొల్లి సీతారామరాజు, కె.విమల పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షులు దాదాపు ఖరారు

విశాఖకు చోడే పట్టాభిరామ్, అనకాపల్లికి తాతయ్యబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా చోడే పట్టాభిరామ్ నియమితులైనట్లు తెలిసింది. టిడిపి జిల్లా పార్టీ కమిటీల ఎంపికపై ఆ పార్టీ త్రిసభ్య కమిటీ రాష్ట్రంలోని 25 జిల్లాల పార్టీ అధ్యక్షులను ఎంపిక చేయగా పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనికి ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షునిగా చోడే పట్టాభిరామ్ నియమితులైనట్టు ఆ పార్టీ స్థానిక నాయకులు మీడియాకు తెలిపారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన పట్టాభిరామ్ 2016 నుంచి 2019 వరకు రెండు పర్యాయాలు టిడిపి నగర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రభుత్వం ఇటీవల ఒక నామినేటెడ్ అధికారిక పదవిలో నియమించింది కూడా. ఇంత వరకు టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. బాబ్జి పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా కూడా కొనసాగుతున్నారు. ఇకపోతే టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా చోడవరం అసెంబ్లీ నియోజకవర్గం వడ్డాది ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు బత్తుల తాతయ్య బాబు మరోసారి నియమితులైనట్టు తెలిసింది.

మరోవైపు కోట్ని బాలాజీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైనట్టు సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది.

గంజాయి నిర్మూలనకు అవిరళ కృషి

ప్రజాశక్తి -పాడేరు: గంజాయి నిర్మూలనకు అల్లూరి జిల్లా యంత్రాంగం అవిశ్రాంత కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం గంజాయి నిర్మూలనపై అంబేద్కర్ జంక్షన్ నుండి ఐటిడిఎ జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్‌పి అమిత్‌బర్ధర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు, ఎస్‌పి అమిత్ బర్ధర్, పాడేరు డిఎస్‌పి షేక్ షామబాజ్, ఇతర అధికారులతో కలిసి సైకిల్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాఠశాలల విద్యార్థులు 'నో డ్రగ్స్ నో టెన్షన్, ఇదే మీ సక్సెస్ మంత్రం', గంజాయి నుండి భవిష్యత్తును రక్షించుకొండి, బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మనకొద్దు' నినాదాలతో సైకిల్ ర్యాలీ సాగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 900 ఎకరాలకు పైబడి ఉన్న గంజాయి సాగును స్థానిక రైతులు, ప్రజల సహకారంతో రెండేళ్లుగా క్రమేణా నిర్మూలిస్తున్నామన్నారు. గంజాయి సాగు, వినియోగం నిర్మూలనకు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుబాఇరిన పడకుండా పోలీస్,ఎక్సైజ్, విద్యా, సంక్షేమశాఖల అధికారులతోపాటు లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో అనునిత్యం చైతన్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రజలు, యువత విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించి దూరం చేసే చర్యలు చేపడుతున్నామన్నారు. అల్లూరి సరిహద్దుల్లోకి రాకుండా గంజాయిపై పటిష్టనిఘాకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీ అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సింబయాసిస్ సిఇఒ నరేష్‌కుమార్‌కు డాక్టరేట్



నరేష్ కుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న విసి రాజశేఖర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి, సింబయాసిస్ టెక్నాలజీస్ సిఇఒ ఓరుగంటి నరేష్ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పర్యవేక్షణలో వర్క్‌ప్లేస్ డైనమిక్స్ అండ్ చాలెంజెస్ ఇన్‌ద ఐటి సెక్టార్ పోస్ట్ పాండమిక్- ఏ కేస్ స్టడీ ఆన్ వర్క్ ఫ్రం-హోం ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో డాక్టరేట్ ఉత్తర్వులను నరేష్‌కుమార్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు. అనంతరం నరేష్‌కుమార్‌ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు తన కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఋషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఉపాధ్యక్షునిగా నరేష్ కుమార్ సేవలు అందిస్తున్నారు.

రేపు విశాఖలో పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: విశాఖపట్నంలో గురువారం ఉదయం 10 గంటలకు సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో పెన్షన్ జిపిఎఫ్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ కవిటి మోహనరావు తెలిపారు. రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (లెక్కలు, హక్కులు) కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన కార్యదక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెన్షన్ అదాలత్ ఉద్దేశ్యం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షన్ మంజూరు అధికారులకు మార్గనిర్దేశం చేయడం, పింఛన్ దరఖాస్తులను సమయానికి, సక్రమంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి పంపించడంపై అవగాహన కల్పించడం అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సంబంధిత సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారం చూపించేందుకు ఈ అదాలత్ ఉపయోగపడనుందన్నారు. ఇప్పటికే విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, కడప, పాడేరు, తిరుపతి, వెలగపూడి, మంగళగిరి, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు, భీమవరం ప్రాంతాల్లో అదాలత్ నిర్వహించా మన్నారు. విశాఖలో రెండోసారి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ హాజరుకానున్నారన్నారు. సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఖుషాల్ కార్తిక్, సీనియర్ అకౌంట్స్ అధికారులు బాలాజీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

నర్సింగ్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జర్మనీలో నర్సింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం షెడ్యూల్డ్ కులాలు - షెడ్యూల్డ్ తెగలు అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక అవకాశాన్ని అందిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. బిఎస్‌సి నర్సింగ్ లేదా జిఎన్‌ఎం పూర్తి చేసిన 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సుగల మహిళా అభ్యర్థులు అర్హులని ఆయన మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆరు నెలల పాటు జర్మన్ భాష శిక్షణను పూర్తి ఉచితంగా అందించనున్నారని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారుగా 2 లక్షలా 40 వేల నుండి 3 లక్షలా 10 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల యువతులు మరిన్ని వివరాల కోసం స్కిల్ ఇంటర్నేషనల్ కో - ఆర్డినేటర్ రవికిషోర్‌ను 9030108030 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జివిఎంసి జోన్ 4లో పబ్లిక్ గ్రీవెన్స్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం జోన్ 4 కార్యాలయం లో గురువారం పబ్లిక్‌గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ వార్డుల నుండి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వయంగా స్వీకరించి ఆయా ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు అందచేశారు. అనంతరం వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఆయా వార్డులకు చెందిన కూటమి వార్డ్ కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను **గుడుపు అన్నపూర్ణ,** భర్త: కొప్పిశెట్టి వెంకట శివ రామ కృష్ణ, నివాసం : ఇంటి.నెం. 13-111/31, ఫ్లాట్ నెం. 502, జిష్ణు ఎన్‌క్లేవ్ -I, సుజాతనగర్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - అఫిడవిట్ నెం. **IN - AP48978974409579X,** తేదీ 15.12.2025 ప్రకారం నా పేరును **కొప్పిశెట్టి పద్మజ** గా మార్చుకున్నాను. ఇకపై అన్ని అవసరాల కోసం నా పేరు కొప్పిశెట్టి పద్మజ గా ఉపయోగించబడుతుంది.

పాస్‌పోర్టు పోయినది

నా పేరు **కొప్పాక అప్పారావు,** తండ్రి కొప్పాక రామస్వామి, వయస్సు 36 సం॥లు, Flat No.3, SF3, బసవతారక రాంనగర్, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా.

పరవాడ నుంచి దేసపాత్రునిపాలెం మోటారు బైకుపై ప్రయాణిస్తుండగా నా పాస్‌పోర్టు గల బ్యాగ్ పోయినది. పాస్‌పోర్టు నెం **R5903390**, ఎవరికైనా దొరికినచో ఈ దిగువ ఫోను నెంబర్‌కు తెలియజేయగలరు.

కొప్పాక అప్పారావు, 9381938697

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
I.A.1545/2025 in A.S. /2025

Between:
Sri Ballanki Appa Rao
...Appellant/Defendant
And
Sri Patnala Narayana Rao
...Respondent/Plaintiff

NOTICE

To,
Respondent/Plaintiff:
Sri Patnala Narayana Rao,
S/o. Atchiyya, R/at D.No.2-26-19,
Mindi Village, BHPV Post,
Visakhapatnam.

Please take notice that the above petition in I.A.1545/2025 is filed to condone the delay under Section 5 of Limitation Act., and the matter stands posted to **22-12-2025** for your notice and appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-12-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the petition will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
Y.S. NARAYANA MURTHY
Advocate,Visakhapatnam.
Cell: 9848111378.

'మిడ్డే'ను అక్షయ పాత్రకు ఇవ్వొద్దు



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మిడ్డే కార్మికులు

ఎండిఎం కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : మధ్యాహ్న భోజనం పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించడం అన్యాయమని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ, బకాయి బిల్లులు చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంగశ్రీ మాట్లాడుతూ, గత 23 ఏళ్లుగా విద్యార్థులకు వండి వడ్డిస్తున్న తమకు తగిన గుర్తింపు లేకపోవడం అన్యాయమన్నారు. కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్షయ పాత్రకు ఇచ్చేందుకు తాము అంగీకారం తెలిపినట్టు బలవంతపు సంతకాలు చేయించుకోవడం మానుకోవాలన్నారు. ఇప్పటికే సంతకాలు చేయించిన పత్రాలు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 9, 10 తరగతులకు ఇవ్వాల్సిన బకాయి బిల్లులు, నవంబరు నెల వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సీతాభవాని, కె.సావిత్రి, సలీం బీబి, టి.రమాదేవి, టి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9 నుంచి గీతం దూరవిద్య పరీక్షలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 2026 ఫిబ్రవరి 9వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. ఏ విధమైన ఆలస్య రుసుము లేకుండా జనవరి 5వ తేదీలోగా రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాడానికి, పరీక్ష రుసుం చెల్లించడానికి, టైమ్‌టేబుల్ వివరాలకు సిడిఒఇ వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

తోపుడు బండ్లు తొలగింపుపై ధర్నా

ప్రజాశక్తి-మధురవాడ : తోపుడుబండ్లు తొలగింపును వ్యతిరేకిస్తూ జివిఎంసి జోన్- 2 కార్యాలయం వద్ద చిరు వర్తకులు మంగళవారం ధర్నా చేపట్టారు. తమకు జరిగిన అన్యాయంపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ మాట్లాడుతూ, పేదలైన తోపుడు బండ్ల కార్మికులను కూటమి ప్రభుత్వం దారుణంగా హింసిస్తోందన్నారు. పిఎం.పాలెంలో తోపుడు బండ్లు, నేలపైన చిరు వర్తకం చేసుకుంటూ జీవిస్తున్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేస్తామని చెపుతున్న కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారుల స్వయం ఉపాధిని నాశనం చేస్తుందన్నారు. తోపుడు బండ్ల వర్తకులపై దాడులు ఆపకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వినతి పత్రాన్ని జోనల్ కార్యాలయం గోడకు అంటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.ధనూర్జి, బి.కిశోర్, ఎస్.కిశోర్, బి.సునీత, నీలిమ, పి.సూరమ్మ, డి.రాణి తదితరులు పాల్గొన్నారు.



జివిఎంసి జోన్-2 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

యుజిడి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి భగత్‌సింగ్ నగర్‌లో జరుగుతున్న యుజిడి పనులను టిడిపి వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, నాయకులు కెల్ల సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు పనులు వేగవంతం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు పట్టా నూకరాజు, తెలుగు యువత అధ్యక్షుడు వడిశెల శ్రీను, చిన్నారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుప్పట్లు

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాళ్ల గురునాయుడు తృతీయ వర్ధంతి సందర్భంగా కెజిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళ్లవలస భరోసా లిటిలహాగ్స్ అనాథాశ్రమం బాలలకు దుప్పట్లు పంపిణీచేశారు. అనంతరం పిల్లలకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్, పురుషోత్తం, ఆనంద్ కుమార్, పిట్ట వెంకట్రావు, ఉప్పల రమేష్, కంచర్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

గీతం ఆసుపత్రికి రెండు పార్థివదేహాలు అప్పగింత

ప్రజాశక్తి-మధురవాడ : వైద్య విద్యనభ్యసించే విద్యార్థుల అధ్యయనానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన డాక్టర్ రామన్న ఛారిటబుల్ ట్రస్ట్ రెండు పార్థివదేహాలను మంగళవారం అప్పగించింది. కర్ణాటకకు చెందిన నిర్మల పుండరిక రాయిబాగి (69), కలవు యల్లప్ప ఇంగడల్లి (83) పార్థివ దేహాలను గీతం ఆసుపత్రిలోని శరీర నిర్మాణ శాస్త్ర విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామన్న ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ మహంతేష్ రామన్నవార్ మాట్లాడుతూ, శరీరదానంపై అవగాహనకు తన తండ్రి పార్థివ దేహన్ని 2010లో స్వయంగా తానే విచ్ఛేదనం చేశానని తెలిపారు. వైద్య విద్యార్థులకు మొదటి గురువుగా పార్థివ దేహలను పేర్కొంటారని, శరీర దాత నిస్వార్థ ప్రవర్తనను అభినందించడానికి పార్థివ దేహనికి గౌరవ సూచనగా ప్రమాణం చేస్తారని వివరించారు. శరీర దానానికి ముందుకు వచ్చిన వారి కుటుంబ సభ్యులకు గీతం వైద్య కళాశాలల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, శరీర నిర్మాణ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పద్మిని, వైస్ ప్రిన్సిపల్ (అకాడమిక్) డాక్టర్ రమణరావు ధన్యవాదాలు తెలిపారు.



గీతం మెడికల్ కాలేజీకి అప్పగించిన పార్థివ దేహాలు

మద్ది పాల సంఘం అధ్యక్షునిగా ప్రకాశరావు



ఎన్నికైన మద్ది పాల సేకరణ కేంద్రం కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పాల సేకరణ కేంద్రం అధ్యక్షునిగా బుగత ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మద్ది పాల సేకరణ కేంద్రం భవనంలో మంగళవారం విశాఖ డెయిరి అధికారులు, ట్రస్ట్ సిబ్బంది పెద్ద నాయుడు, రవికుమార్, మహేష్ ఆధ్వర్యంలో రైతులు పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రకాష్‌రావును పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా కనకల శ్రీనివాసరావు, కనకల గణేష్, కనకల బంగారు నాయుడు, కనకల పాపునాయుడు, కనకల అప్పలనాయుడు, కనకల సత్యం, రామసింగు అప్పలనాయుడు, కాళ్ల చిన్నయ్య, కాళ్ల చిన్నతల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేరాలు ఘోరాలు



పట్టుబడ్డ గంజాయి నిందితులతో పోలీసులు

21 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ : అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని పట్టుకుని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సై రుషికేశ్వరరావు తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఏఎల్.పురం గ్రామ శివారులో మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన వంతల బాబురావు, పాంగి సత్తిబాబుతో పాటు తమిళనాడుకు చెందిన మాలసెల్వి, సుంతరి అనే ఇద్దరు మహిళలను అరెస్టు చేశామని తెలిపారు. గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని నామవరం గ్రామ శివారులో అక్రమంగా విక్రయిస్తున్న ఏడు మద్యం సీసాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సిఐ అప్పన్న ఉత్తర్వులు మేరకు ఎస్ఐ ఆలీ పోలీసు సిబ్బందితో దాడిచేసి ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర నుండి ఓల్డ్ అడ్మిరల్ 180 ఎంఎల్ నాలుగు, ఆఫీసర్ ఛాయిస్ 180 ఎంఎల్ మూడు, మొత్తం ఏడు సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భీమిలి తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

తీరంలో తాబేలు కళేబరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద ఉప్పుటేరు నుంచి సముద్రతీరం బోయివీధి మధ్యలో సుమారు 10 తాబేలు కళేబరాలు మంగళవారం కొట్టుకొచ్చాయి. వీటితో పాటు డాల్ఫిన్ కళేబరం కూడా తీరానికి కొట్టు కొచ్చింది. గతంలో కూడా పలు తాబేలు కళేబరాలు తీరానికి కొట్టు కొచ్చాయి. తాబేలు కళేబరాలు కొట్టుకు రావడంపై పలువురు పర్యావరణ వేత్తలు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో ఇష్టారీతిన కలుస్తున్న రసాయన వ్యర్థాలతో తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు అంటున్నారు.

18న ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : టెట్, బోధనేతర కార్యక్రమాలు, సింగిల్ టీచర్ల సెలవులు తదితర సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన డిఇఒ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, కోశాధికారి కె.రాంబాబు కోరారు. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను కలిసి నోటీసు అందజేశారు.



డిఇఒకు ధర్నా నోటీసును అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉక్కునగరంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం టౌన్‌షిప్ ప్రజల సౌకర్యార్థం ఆధార్ సంబంధిత సేవల కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉక్కునగరం సెక్టర్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వార్డు సచివాలయంలో ఈ ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేషన్‌తో పాటు ఆధార్‌లో పేరు, చిరునామా, జన్మతేది, లింగం, మొబైల్ నంబర్ వంటి వివరాల సవరణలు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గంగారావు కోరారు.

న్యాయ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : నగరంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థలో న్యాయ సహాయకులుగా పనిచేయడానికి అర్హులైన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవ ప్రాధికార సంస్థ చైర్మన్ చిన్నంశెట్టి రాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వృద్ధులు, పేదలు, మహిళలు, నిరాదరణ గురైన వారు, అల్పాదాయవర్గాలు, చట్టం పరిధిలోని అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయంలో డిఫెన్స్ కౌన్సిల్‌గా సేవలందించడానికి మూడు కేటగిరిలో న్యాయవాదులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రధాన, ఉప న్యాయ సహాయకులు, లీగల్ అసిస్టెంట్ల పోస్టులకు ఈ నెల 31వ తేదీలోపు న్యాయ సేవ ప్రాదికార సంస్థలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఐటిబిపిలో విద్యార్థులకు విజ్ఞాన సందర్శన

ప్రజాశక్తి-ఆనందపురం: ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) 56వ బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో ది సీడర్ స్కూల్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం విజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సాయుధ పోలీస్ బలగాల విధులు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, దేశ సేవలో వారి పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సందర్శనలో భాగంగా విద్యార్థులు ఆయుధాల ప్రదర్శన, శారీరక శిక్షణ ప్రదర్శనలను తిలకించారు. బృందాత్మక పని విధానం, క్రమశిక్షణ, జాతీయ సేవ పట్ల అంకితభావంతో కూడిన బలగాల జీవన శైలిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బెటాలియన్‌కు చెందిన సీనియర్ అధికారులు విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి, మంచి పౌరులుగా మారాల్సిన అవసరం, క్రమశిక్షణ ప్రాధాన్యత, రాజ్యాంగ విలువలు, చట్ట వ్యవస్థ నిర్వహణ, అంతర్గత భద్రత, సరిహద్దుల రక్షణలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల కీలక పాత్రను వివరించారు. బలగాల విధులు, విలువలను దగ్గరగా తెలుసుకునే అవకాశం కల్పించినందుకు ఐటిబిపి అధికారులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.

ఇంధన పొదుపుపై అవగాహన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ములగాడ : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జివిఎంసి మల్కాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో ఎపిఇపిడిసిఎల్ ఎఇ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రపంచంలో విద్యుత్, ఇంధనం ఎంతో ఉపయోగకరమైనదని, ప్రతి ఒక్కరూ పొదుపు చెయ్యాలని కోరారు. ఈ సందర్భంగా 5, 6 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, 8, 9 తరగతులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వారోత్సవాల అనంతరం విజేతలకు బహుమతులు ఇవ్వనున్నారు.

నరవలో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 88వ వార్డు పరిధిలోని నరవ శంభుని ఆలయం ప్రాంగణంలో జెడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. గుడి ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. ముందుగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను గ్రూప్ సభ్యులు ఆదిల్ వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సిహెచ్.వీరునాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలవాలని కోరారు. కళాశాల సిబ్బంది, జెడి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్ కార్మికుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

డైరెక్టర్ ఫైనాన్స్ వినయ్‌కుమార్‌కు వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఏడాదిగా స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (ఫైనాన్స్) వినయ్ కుమార్‌ను స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినయ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి నిరంతరాయంగా సాగేందుకు అవసరమైన రా మెటీరియల్ అందుబాటులో ఉండేలా, ఫైనాన్స్ అవరోధాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై సానుకూలంగా స్పందించి కార్మికులను ఉత్సాహపరిస్తే, వారు మరింత చురుకుగా పనిచేసి ఉత్పాదకతను పెంచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా కార్మికులకు చెల్లించాల్సిన 355 శాతం బకాయి జీతం, ఈ నెలకు సంబంధించిన 12 శాతం జీతాన్ని వెంటనే చెల్లించాలని కోరారు.

యూనియన్ అధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు హెచ్ఆర్ఎ చెల్లించకపోవడం, థ్రిఫ్ట్ సొసైటీ రికవరీని పునరుద్ధరించడం, ఇఎల్ అమ్ముకునేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికుల కరెంటు చార్జీలను తగ్గించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమస్యలపైనే హెచ్ జిఎం బినయ్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బిఎన్.మధుసూదన్, టివికె.రాజు, బి.మహేష్, ఎ.శ్రీనివాస్, దేముడునాయుడు, శ్రీనివాసరెడ్డి, రామన్న, పవన్, రాజు, వి.మురళి తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

పదోతరగతి పరీక్షలపై 20న అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై ఈ నెల 20వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) గౌరవాధ్యక్షులు పాలవలస భాస్కరరావు తెలిపారు. భాస్కర్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిప్సా పరిధిలో ప్రయివేటు పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి నెలలో జరగబోవు పబ్లిక్ పరీక్షలు బాగా రాయడం కోసం అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సు జగ్గు సెంటర్‌లోని గాజువాక క్లబ్‌లో ఉంటుందని పేర్కొన్నారు అవగాహనా సదస్సులో జిప్సా పరిధిలోని స్కూళ్ల కరస్పాండెంట్‌లు వారి విద్యార్థులను తప్పకుండా హాజరుపరిచి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిప్సా అధ్యక్షులు బి.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు, కార్యవర్గ సభ్యులు పి.మురళీసుందర్, చంద్రమౌళి, సత్య, సతీష్, రంగనాథ్, వెంకట్, వెంకునాయుడు పాల్గొన్నారు.

'ఆదర్శ్'లో ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ విజయవంతం

ప్రజాశక్తి-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎంఇ ట్రైనింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. ఎపి ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ నోడల్ ఏజెన్సీగా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిఐటిడి) ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, వరల్డ్ బ్యాంక్ సహకారంతో ఎస్‌డిపి ర్యాంప్ స్కీమ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ, ఈ ఎంఎస్ఎంఇ ప్రోగ్రామ్‌కు రెండు బ్యాచ్‌లను మంజూరు చేసిన సిఐటిడి హైదరాబాద్ ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ టి.విజయ్‌కృష్ణకాంత్‌కు, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్‌కు చెందిన 60 మంది విద్యార్థులకు ఎఐ ఇన్నోవేషన్ అండ్ డీప్ లెర్నింగ్ ఫర్ స్టార్టప్ డెవలప్‌మెంట్ అంశాలపై శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. సిఐటిడి హైదరాబాద్ ట్రైనర్ ఎస్.వంశీకృష్ణ శిక్షణ అందించారు. వ్యాపార అభివృద్ధి, ఆలోచనలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై ఐఎల్ఒ ట్రైనర్ డి.మోహన్ కుమార్ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ట్రైనింగ్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. స్వయం ఉపాధి, స్టార్టప్‌ల స్థాపనకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎస్‌వి.సాయి, ప్రణీత్, జి.రాజ్ కుమార్, కెఎస్ఆర్.రాజేశ్వరావు, శ్రీనివాసరావు, వి.సుందర్‌సింగ్ బాబు, కె.సునీల్‌కుమార్, జి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డులోని క్రికెట్ మినీ స్టేడియంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి, సీతమ్మధార మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు జరిగిన క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్, త్రో బాల్ పోటీల్లో ఆనందపురం జట్లు విజేతగా నిలిచాయి. త్రో బాల్ పోటీల్లో భీమిలి జట్టు, క్రికెట్‌లో చినగదిలి జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ఈ తరహా క్రీడా పోటీలు నిర్వహించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం ఆర్‌జెడి కె.విజయభాస్కర్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఆయా మండలాల ఎంఇఒలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పాఠశాలకు 'దివీస్' నీటి సౌకర్యం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిన్ననాగమయ్యపాలెంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్య ప్రతినిధులు గమనించి సుమారు రూ.70 వేలు సిఎస్ఆర్ నిధులతో సబ్‌మెర్సిబుల్ పంపు, పైప్‌లైన్, మంచినీటి కుళాయి కనెక్షన్స్ సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విమర్శలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి -గాజువాక : మెడికల్ కాలేజీల పిపిపి విధానంపై వైసిపి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని గాజువాక తెలుగుదేశం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ప్రజలెవరూ స్వచ్ఛందంగా సంతకాలు పెట్టలేదని, కోటి సంతకాల సేకరణ అదంతా ఓ బోగస్ అని పేర్కొన్నారు. త్వరలో గాజువాక షీలానగర్ ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద మెడికల్ కాలేజీ నిర్మించి వైసిపికి బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో 73వ తెలుగుదేశం అధ్యక్షులు సింగూరి అనంత్, గాజువాక నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షులు తమరి శివప్రసాద్, టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షులు అంజిబాబు, మైనార్టీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు రహిమాన్, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి దొడ్డి సత్యారావు, కార్యదర్శి భాస్కరరావు, 65, 66 వార్డుల క్లస్టర్ ఇన్‌ఛార్జులు కె.శ్రీనివాసరాజు, సత్యనారాయణ, శ్రావణ, చంద్రరావు పాల్గొన్నారు.

23న షాపులకు వేలం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 3వ జోన్ (ఆశీలు మెట్ట) పరిధిలో ఖాళీగా వున్న షాపు రూములకు, కమ్యూనిటీ హాల్‌నకు ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. ఎంవిపి కాలనీ వాణిజ్య సముదాయములో షాప్ రూమ్ నెంబర్లు 10, 11, 12, 13, 14, 15, 16లకు, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయంలో షాప్ రూమ్ నెంబర్ 9, జగ్గారావు బ్రిడ్జి వాణిజ్య సముదాయములో షాప్ రూమ్ నెంబర్ 6, బిటిఆర్ కాలనీ, రెల్లివీధిలోని కమ్యూనిటీ హాల్‌ను మూడేళ్ల కాలానికి గుత్తకు ఇచ్చుటకు ఆశీలు మెట్ట కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు జోనల్ కమిషనర్ కార్యాలయంలోని పర్యవేక్షకులను పని వేళలో సంప్రదించాలని సూచించారు.

పెద్దిపాలెంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం, పెద్దిపాలెం పంచాయతీ అప్పన్న కాలనీలో భీమిలి ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 'క్లీన్ అండ్ గ్రీన్' చేపట్టారు. ఇంటింటి ఆరోగ్య సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీను, వాలంటీర్లు పాల్గొన్నారు.

పశుగ్రాసంపై యూరియా కొరత ఎఫెక్ట్

- పాడి రైతులకు సరిపడా అందని ఎరువులు
- మరుగుజ్జులా ఉండిపోతున్న ఫారం గడ్డి
- పశుపెంపకానికి ఇబ్బంది పడుతున్న వైనం

ప్రజాశక్తి-కె.కోటపాడు : గడచిన రెండు నెలల నుండి యూరియా లభించకపోవడంతో పశువులు మేపుతున్న రైతులు పశుగ్రాసం కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఫారం గడ్డి కోసిన ప్రతిసారి యూరియా వేస్తేనే తప్ప అది పెరిగే అవకాశం ఉండదు. యూరియా సకాలంలో వేసినట్లయితే సుమారుగా రెండు నెలలకు ఒకసారి కోతకు వస్తుంది. యూరియా వేయకపోవడంతో నాటిన పిలకలు అలాగే మరుగుజ్జులా ఉండిపోయి పువ్వులు పూస్తున్నాయి. యూరియా వేస్తే ఈ ఫారం గడ్డి సుమారుగా నాలుగు నుండి ఐదు అడుగుల వరకు ఎదుగుతుంది. కానీ ఇప్పుడు రెండు అడుగుల వరకు కూడా ఎదగడం లేదు. అది కూడా పల్చగా ఉండడంతో ఎంత విస్తీర్ణంలో కోసినా ఒక మోపు కూడా అవడం లేదని రైతులు వాపోతున్నారు.

గతంలో ప్రతి రైతు చెరకు సాగు చేయడం వలన చెరకు మొసులను డిసెంబర్ నుంచి ఏప్రిల్ నెల వరకు పశువులకు గ్రాసంగా ఉపయోగించేవారు. దీని వల్ల ఐదు నెలల పాటు పశువులకు గ్రాసం కొరత తీరేది. కాని నేడు సుగర్ ఫ్యాక్టరీల్లో చెరకు గిట్టుబాటు కాక, అటు బెల్లం మార్కెట్‌లో లావాదేవీలు తగ్గడంతో రైతులు చెరకు సాగును పూర్తిగా విస్మరించారు. దీంతో రైతులకు పశు గ్రాసం కొరత ఏర్పడింది. అంతేకాకుండా గతంలో బీడు భూములు ఉండేవి. వాటిల్లో రైతులు పశువులను మేపుకునేవారు. ఇప్పుడు ఎక్కడా ఖాళీగా ఉన్న బీడు భూములు, ఏటి పాడవలు, గెడ్డపాడవలు లేవు. చెరకు సాగు తగ్గిన తర్వాత రైతులు సరుగుడు, టేకు, యూకలిప్టస్ వంటివి సాగు చేయడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. పశువులకు గ్రాసం కొరత వల్ల కళ్ళం వద్దనే పశువులను మేపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


ఫారం గడ్డి ఎదగకుండానే పువ్వు వచ్చేసిన దృశ్యం

ప్రస్తుతం ప్రతి రైతూ రెండు లేక మూడు పాడి పశువులను మేపుతున్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులు తమకు సొంత భూమి లేకపోయినా భూమిని కౌలుకు తీసుకొని అందులో ఫారం గడ్డిని పెంచుతున్నారు. మండలంలో 90 శాతం మంది పాడి రైతులు ఈ గడ్డి పైనే ఆధారపడి పశులను పెంచుతున్నారు. ప్రస్తుతం మంచు విపరీతంగా కురుస్తున్నందున గడ్డి పెరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో పాటుగా యూరియా కూడా పూర్తిగా లేకపోవడంతో రైతులు పెంచుతున్న గడ్డి పూర్తిగా మొక్క దశలోనే ఉండిపోతుంది. పశుగ్రాసం కొరత ఏర్పడి పశు వులను మేపడం కష్టమైపోతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వాలు పశువులకు సబ్సిడీపై పశు దాణాను అందజేసేవి. కొన్ని సంవత్సరాలుగా అది కూడా లేకుండా పోయింది. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి పశుపెంపకం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని, గతంలో మాదిరిగా పశుదాణా ఇవ్వాలని పాడి రైతులు కోరుతున్నారు.


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీఆదినారాయణ మహిళా కళాశాల (ఉమెన్స్ కాలేజీ)లో బుధవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏపి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి గోడ పత్రికను జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, బిటెక్, ఎంసీఏ, ఎంబీఏ, విద్యా అర్హతలతో కూడిన అభ్యర్థులకు 3152 ఉద్యోగాలతో 56 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. తమ బయోడేటా, ఆధార్ కార్డ్, సంబంధిత విద్య సర్టిఫికెట్లతో ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. http://www.naipunyam.ap.gov.in లో అనే వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆఫీసర్ గోవిందరావు, జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఏపీడీఓ సంతోష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రజల సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ వారిపై సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని బట్లపూడి, గోలగాం గ్రామాలలో అనకాపల్లి డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ విద్యార్థులు వారం రోజుల శిబిరంలో భాగగా రెండో రోజు మంగళవారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బట్లపూడి ప్రైమరీ స్కూల్, పంచాయతీ ఆఫీస్, అంగన్వాడి కేంద్రాల్లో చెత్త చెదారాన్ని తొలగించి ఆ ప్రాంతాలను శుభ్రపరిచారు. గోలగాం గ్రామం నుండి కాలనీ వరకు ప్రదర్శనగా వెళ్లి ప్లాస్టిక్ వాడకం వద్దు పర్యావరణం ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.మల్లికార్జునరావు, ఎంజీ.రాజ్ కుమార్, గ్రామ సర్పంచులు గొంతిన సత్యారావు ఎస్ నాగ నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన నాగజగదీష్


ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రాష్ట్ర విద్యాశాఖ ఐటి మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటన ముగించుకొని విశాఖ విమానాశ్రయానికి వచ్చిన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. త్వరలో అనకాపల్లిలో పర్యటించాలని కోరగా హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అంగన్వాడీలకు సెల్‌ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్ట్ పరిధిలోని కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల అంగన్వాడి కార్యకర్తలకు ప్రభుత్వం మంజూరు చేసిన 5జి సెల్ ఫోన్లను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం పంపిణీ చేశారు. సీడీపీఓ లలితకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్ మోహన్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, సర్పంచ్ యర్రంశెట్టి భవాని, ఎంపీడీఓ ఏఓ అప్పలరాజు, టిడిపి నేతలు కన్నూరు సూర్యనారాయణ, చీపురుపల్లి రామారావు, జూరెడ్డి రాము, వెలగల పైడంనాయుడు, సబ్బవరపు రామునాయుడు, వివిఎస్.నాయుడు, యద్ల రమేష్ పాల్గొన్నారు.


సెల్ ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

20న అనకాపల్లిలో చంద్రబాబు పర్యటన?



ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఈ నెల 20వ తేదీన అనకాపల్లిలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారికంగా ప్రకటన లేకపోయినా క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామాల్లో బాల్య వివాహాలను వ్యతిరేకించాలని ఐసిడిఎస్, పిడి ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. బాల్య వివాహాల నిషేధ మాసోత్సవాలలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఐసిడిఎస్ పిఓ వి.లలితకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు మూఢ నమ్మకాలతో ఆడపిల్లలను చిన్నతనంలోనే బాల్య వివాహాలు చేస్తుంటారని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పడాల వెంకటరమణ, కర్రి నర్సింగరావు, పిల్లల అప్పలనాయుడు, ఎంఈఓ ఎంజె రవీంద్రబాబు, పలువురు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనాన్ని అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన అనకాపల్లి జిల్లా గ్రంథాలయ భవనాన్ని తక్షణమే ప్రారంభించి పాఠకులకు, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా గ్రంథాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఓ షేక్ ఆయిషాకి వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వినకోట నిలేష్ గుప్తా, సహాయకార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గసభ్యులు బొడ్డు సోమరాజు, ఊడా నాగేశ్వరరావు, అయ్యగారు వెంకట రమణమూర్తి, కాపారపు సత్యనారాయణ, పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను మంగళవారం కొట్ని శివ శ్రీను చేతుల మీదుగా పంపిణీ చేశారు. గతేడాది యుటిఎఫ్ మెటీరియల్ చదివిన కొండకర్ల ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించారని చెప్పారు.


టెన్త్ మోడల్ పేపర్లు అందించిన యుటిఎఫ్ నాయకులు

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-కశింకోట : ఏపీ వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ జేఏసీ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు కశింకోటలోని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయం వద్ద మంగళవారం పిఎసిఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా పిఎసిఎస్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందులో కీలకంగా పని చేసే పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 36 జీవో విడుదల చేసి హెచ్ఆర్ పాలసీని నిర్ణయించి అమలు చేయాలని, 2019 తర్వాత జాయిన్ అయినా వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని, రెండు పీఆర్సీలు అమలు చేయాలని, చట్ట ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల పెంచాలని, ఉద్యోగులకు రూ.10 లక్షల బీమా కల్పించాలని, ఆరు శాతం డివిడెంట్ వడ్డీతో సహ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డేటి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి బొంపా రమణ, గౌరవ అధ్యక్షులు పి.నాగభూషణం, అసోసియేట్ ప్రెసిడెంట్ యమలోవరాజు, శివరామకృష్ణ, కోశాధికారి ఎల్లపు లక్ష్మణకుమార్, బొడ్డేటి జగన్, ఆర్.వెంకట్రావు, అధిక సంఖ్యలో పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం నాయుడుపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.యశస్విని యోగాసనాల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. అనకాపల్లిలో ఆగస్టు నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించిన యశస్విని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అనంతపురంలో డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం గెలుచుకుంది. ఈ మేరకు ఈ నెల 29 నుంచి జనవరి 2 వరకు మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఎన్‌టిపిసి భాగస్వామ్యంతో పాఠశాలలో అందించిన యోగా శిక్షణ వల్లే యశస్విని ఈ స్థాయి విజయాలు సాధించగలిగిందని హెచ్ఎం బి.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు యశస్విని, ఎన్‌టిపిసి యోగా శిక్షకులు సి హెచ్.ఆంజనేయులును అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జాతీయస్థాయి రగ్బీ పోటీలకు అనకాపల్లి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అనకాపల్లి జిల్లా క్రీడాకారులు 12 మంది పాల్గొన్నారు. వారిలో మూడు కేటగిరీలలో 9 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ వెంకట్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రంలో అనకాపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారులు అధిక సంఖ్యలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనిమిరెడ్డి అర్చనకావ్య, బొడ్డు కుసుమ, బి.ఇందు, జి.సుధా, ధర్మిరెడ్డి వసంత, ఆర్.దీపిక, రాజాన బాలవిష్ణు ప్రియ ఎంపికయ్యారు. జనవరిలో చెన్నైలో జరగబోయే సౌత్ జోన్ అస్మిత రగ్బీ లీగ్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అనకాపల్లి జిల్లా రగ్బీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కే వెంకీ నాయుడు అధ్యక్షులు జగదీష్ ఆనందం వ్యక్తం చేశారు.

20న కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ప్రసిద్ధి చెందిన కుంచావారు శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈనెల 20న జరగనున్న నేపథ్యంలో మంగళవారం కరపత్రాన్ని జనసేన పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరభద్రరావు, ట్రెజరర్ కర్రి కృష్ణ, గౌరవ అధ్యక్షులు పొంద్రంగి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, కుంచా వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే భూసేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్పొరేట్, బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణ చేస్తున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం న్యూ కాలనీ రోటరీ క్లబ్‌లో సదస్సు జరిగింది. ముందుగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 200 మంది రైతులు, వ్యవసాయ కూలీలతో పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నుండి నెహ్రూ చౌక్, రాజా థియేటర్ మీదుగా రోటరీ కళ్యాణ మండపం వరకు ర్యాలీ చేసి, మానవహారం చేపట్టారు. ఇందులో ముఖ్య వక్తగా ఝాన్సీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని, కార్మికులను, పీడిత ప్రజలను దోపిడీ చేసే విధానాలను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు. దానిలో భాగంగానే పచ్చని పంట పొలాలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు ధారా దత్తం చేస్తున్నాయని మండిపడ్డారు. మనం ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్లమెంట్లు, అసెంబ్లీలలో రైతులకు, కార్మికులకు సామాన్య ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో 'కార్మిక నగారా' పత్రిక ఎడిటర్ ఆడారి అప్పారావు, ఏఐఎఫ్‌టియూ(న్యూ) జిల్లా నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, నవ యువ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందారపు భాస్కరరావు మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షులు పైలి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కిల్లి దేముడు, గొర్లి రాజు, మరిసా సతీష్, కరణం తవిటమ్మ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు


మాట్లాడుతున్న గంగాగ్నిరావు

బయోగ్యాస్‌తో సుస్థిర భవిష్యత్తు

ప్రజాశక్తి-పాయకరావుపేట : బయో గ్యాస్‌తో సుస్థిర భవిష్యత్తు సాధ్యమవుతుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ గంగాగ్నిరావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన బయోగ్యాస్‌పై అవగాహనా సదస్సులో ఆయన ప్రసంగించారు. తక్కువ ఖర్చుతో పర్యావరణానికి హాని కలిగించకుండా డెయిరీ వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, ఫార్మా కంపెనీల వ్యర్థాలు ముడి పదార్థాలుగా ఉపయోగించి బయోగ్యాస్‌తో పాటు సేంద్రియ ఎరువును, విద్యుత్తును, వాహనాలకు ఇంధనం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, చైర్మన్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నగేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ రాజీనామా

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది రేషన్ డీలర్ డివిఏఆర్.దొర మంగళవారం రాజీనామాను చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని మండల తహసిల్దార్ ఎం.లక్ష్మికి అందజేశారు.

ఏటికొప్పాకలో ఎంపిపి పర్యటన

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో మంగళవారం ఎంపీపీ రాజాన శేషు పర్యటించారు. గ్రామ సచివాలయంలో అధికారులు, నాయకులతో పలు సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అన్నం బాబుజి, ఎంపీటీసీ నాగిరెడ్డి అమ్మాజీ, అచ్చి నాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ చిరంజీవి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొమల్లపూడిలో ప్రభుత్వం మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లును విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోకివాడ కోటేశ్వరరావు, ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ నాగేశ్వరరావు, పెదపూడి జనసేన గోకివాడ సత్తిబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అచ్యుతాపురం సిఐ చంద్రశేఖరరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. అచ్చుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో రాణించిన వారికి ఆయన చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. ఎస్సై సుధాకర్ రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు జెడ్‌పి స్త్రీ, శిశుసంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లే అనురాధ మంగళవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ సాధారణ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో ఎంపీపీ పాఠశాల నుండి జగనన్న హౌసింగ్ కాలనీ వరకు సిమెంటు రోడ్డు, కాలువల నిర్మాణానికి ఈ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు, స్థానిక వైసీపీ నాయకులు కాచిపాటి వెంకట రమణ, కన్నమునాయుడు, గొల్లవిల్లి శ్రీను, దారపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎడ్ల పరుగు పందాల పోటీలను నిర్వహించి విజేతలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తురకలపూడి పిఎసిఎస్ చైర్మన్ కోటా సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి డివిజన్‌లో కొనసాగింపునకు తీర్మానంపై హర్షం

ప్రజాశక్తి-మునగపాక : ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలను అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగేలా తీర్మానం చేయడం పట్ల వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం డిఆర్‌సిలో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రస్తావించగా, జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ పెద్దలు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా ఎలమంచిలిని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగేలా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ జీవోను సవరణ చేసి అమలయ్యే విధంగా నేతలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైకాపా మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేత హర్షం

మునగపాక : అనకాపల్లి డిఆర్‌సి సమావేశంలో ఎలమంచిలి నియోజకవర్గాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించేలా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల టిడిపి రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ భీమర శెట్టి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై ప్రధాన భూమిక పోషించిన ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

కొత్త రెవెన్యూ డివిజన్‌లో కలపడం లేదు

యలమంచిలి టౌన్ : కొత్తగా ఏర్పాటు కానున్న నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో యలమంచిలి నియోజకవర్గాన్ని కలపడం లేదని కూటమి నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక జనసేన కార్యాలయంలో నాలుగు మండల కూటమి పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరు ఎటువంటి అపోహాలను నమ్మవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై సర్వత్రా వ్యతిరేకత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన విశాఖ జిల్లాలో తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమం విజయవంతమైందని, ఆ సంతకాల ప్రతుల వ్యాన్ ర్యాలీ సూపర్ సక్సెస్‌గా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్‌ఛార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. మంగళవారం వైసిపి 35వ వార్డు అధ్యక్షులు అలుపున కనకరెడ్డి కార్యాలయంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ సక్సెస్ సమావేశంలో వాసుపల్లి మాట్లాడారు. ఈ నెల 21న మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోటి సంతకాల ఊరేగింపునకు సహకారంపై కృతజ్ఞతలు

పాయకరావుపేట : వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఊరేగింపునకు సహకారం అందించిన వారందరికీ ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి అనకాపల్లి వరకు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని

సముద్రపు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని రేవు పోలవరంలో మత్స్యకారులకు సముద్రపు నాచు మొక్కల పెంపకంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మీనా కుమారి మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్ళినప్పుడు మత్స్యకారులకు మత్స్య సంపద లభించకపోవడం వేటకు ఉపయోగించే బోట్లకు డీజిల్ రేట్లు పెరిగిపోవడం వంటి కారణాలతో మత్స్యకారుల జీవనోపాధి కష్టంగా మారిందని తెలిపారు. దీని నుంచి బయటపడే దిశగా సముద్రపు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి శృతి, ఏపీఓ, స్థానిక నాయకులు వెంకటరాజు, కోడ లోవరాజు, గుర్రం రామకృష్ణ, అడవి రాజు, కొవిరి బంగారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జామియా మసీద్ పనులకు సహకరించాలి

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట జామియా మసీదు పనులు జరుగుతున్నాయని, వాటికి అనకాపల్లి, విశాఖ జిల్లాల ముస్లిములు సహకరించాలని మసీదు కమిటీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జామియా మసీదు లోతుగా ఉండడంతో వర్షం సమయంలో నీళ్ల నిలిచిపోయే ఇబ్బందులు పడుతున్నామని, దీనిని దృష్టిలో పెట్టుకొని ముస్లిం మత పెద్దలు మసీద్ ఎత్తి చేయడానికి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులకు సహకారం అందించాలని కోరారు.

మాదిగ సామాజిక తరగతి ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-కశింకోట : కసింకోటలోని గుత్త ప్రభాకర్‌చౌదరి తోటలో అనకాపల్లి జిల్లా మాదిగల ఆత్మీయ కలయిక పిక్నిక్ మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు, ముమ్మిడివరపు చిన సుబ్బారావు, పోసపల్లి వెంకట్రావు, తోత్తరమూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల విచారణలో ఎలాంటి లోపాలు లేకుండా, పూర్తి పారదర్శకత పాటించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ కె.మనోరమా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమంగా భావించే పిజిఆర్ఎస్ లక్ష్యాలను అధికారులు చేరుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మంగళవారం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ మనోరమా అక్టోబర్ నెలలో అందిన ఫిర్యాదుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎయిర్ ఫోర్స్‌కు డిగ్రీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బిఏ హిస్టరీ చదువుతున్న వారాది మల్లేశ్వరరావు ఎయిర్ ఫోర్స్ ర్యాలీలో, అగ్నివీర్ ఎయిర్ మెన్‌గా ఎంపిక అవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ, కామర్స్ హెడ్ ఎం.గోవిందరావు, గొర్లె యమున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం అగ్రహారం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్ బుక్కులు, పాఠ్యపుస్తకాలు, అసెస్మెంట్ పుస్తకాలును తనిఖీ చేశారు. జిఎఫ్ఎల్ఎన్ అమలు తీరును పర్యవేక్షించి స్టీమ్, మౌనంటైన్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పరిశీలించి లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లో ఉంచాలని సూచించారు. డిఇఒ వెంట ఎంఈఓ-2 ఎంజె.రవీంద్రబాబు ఉన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో, రైతులు వ్యవసాయ పంటలు, కూరగాయలు, ఉద్యాన పంటలకు యూరియాను మోతాదుకు మించి వాడకుండా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారి ఎల్‌వై.కాంతమ్మ సూచించారు ఈ మేరకు మంగళవారం ఆమె దేవరాపల్లి మండల కేంద్రంలో ఉన్న పురుగుల మందు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మోతాదుకు మించి ఎరువులు సరఫరా చేయకుండా డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని స్థానిక ఎంపీడీవో పి పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రవేట్ స్వచ్ఛంద సంస్థ సివైడిఎ ఆధ్వర్యంలో సిఆర్‌పిలకు పారిశుధ్య నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో తడి చెత్త, పొడి చెత్త పారిశుధ్య నిర్వహణపై రిసోర్స్ పర్సన్ లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం కర పత్రాలను ఆవిష్కరించారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ పద్మజ తదితరులు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



ఉపమాకలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలో ఉపమాక గ్రామంలో మంగళవారం హెల్ప్ ఫుల్ హ్యాండ్స్, సామాజిక వారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు పాల్గొని, 70 మంది నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో దృష్టిలోపం ఉన్న 30 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు.

మిగిలిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడంతోపాటు కంటి సంరక్షణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సతీష్, తేజస్విని, హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ సామాజిక వారధి ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

గ్రామాల్లో మేలు కొలుపులు ప్రారంభం



మేలు కొలుపులో పాల్గొన్న భజన బృందం

ప్రజాశక్తి-గొలుగొండ : ధనుర్మాసం ప్రారంభం కావడంతో గ్రామాల్లో మేలుకొలుపులు మొదలయ్యాయి. గొలుగొండ మండలం సిహెచ్. నాగాపురం గ్రామంలో మంగళవారం మేలుకొలుపుల కార్యక్రమాన్ని భజన బృందం ప్రారంభించారు. తారకరామా భజన బృందం ప్రెసిడెంట్ ఈర్లపాటి రామ గణేష్, సేనాపతి వరహాలబాబు మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ధనుర్మాసంలో నెలరోజులపాటు పురవీధుల్లో శ్రీరాములవారి చిత్రపటాన్ని పల్లకి మీద ఊరేగించు కుంటూ రామనామ సంకీర్తనలతో మేలుకొలుపు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో లంక లోవనారాయణ, అప్పనసత్తిబాబు, అప్పన నాగేశ్వరరావు, యర్రా మురళీ, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపిడిఒ చైతన్య

ప్రజాశక్తి -నక్కపల్లి : రుణాలను సద్వినియోగం చేసుకుని, మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని ఎంపిడిఒ బి చైతన్య అన్నారు. మంగళవారం నక్కపల్లిలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఎపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య సమావేశంలో ఎంపిడిఒ చైతన్య మాట్లాడుతూ, మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని, ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా సభ్యులుగా చేరాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం రూ. 436 ప్రీమియంతో 18నుంచి 50 ఏళ్ల లోపున్న సహజ మరణానికి బీమా వర్తిస్తుందన్నారు. అలాగే ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కేవలం రూ. 20 ప్రీమియంతో 18నుండి 70ఏళ్ల వయస్సు వారికి ప్రమాద బీమా వర్తిస్తుం దన్నారు. అనకాపల్లి జిల్లా బ్యాంకు లింకేజ్ ప్రాజెక్టు మేనేజర్ కుమారస్వామి మాట్లాడుతూ బ్యాంక్ రుణాలు సద్విని యోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎపిఎం శ్రీనివాస్, సిసిలు, మండల సమాఖ్య అధ్యక్షులు అనంత లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

రేపు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఆందోళనకు సిపిఐ పిలుపునిచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని యర్రవరం రాజులబాబు గుడి వద్ద సీనియర్ నాయకులు మేకా సత్యనారాయణ అధ్యక్షతన సిపిఐ మండల సమావేశంలో మాట్లాడుతూ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిహెచ్.క్రాంతి, సిపిఐ మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ, కార్యవర్గ సమితి సభ్యులు లోకరపు అప్పలనాయుడు, మేకా భాస్కరరావు, మర్రిబాబులు, అప్పలనాయుడు, సరివెల్లి చిరంజీవి, కూడా అప్పన్నదొర, లచ్చబాబు, పాల్గొన్నారు

స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-రోలుగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి లక్ష్మీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త వ్యవస్థలో ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి 1.4కోట్ల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వ్యవస్థ ద్వారా ఆధార్, రేషన్ కార్డు, పెన్షన్, స్కాలర్ షిప్‌లు, వ్యాక్సినేషన్ వంటి సమాచారాన్ని క్యూఆర్ కోడ్‌తో కలిపి కార్డుల్లో భద్రపరచి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలుకు శిక్షణ అందించారు.



శిక్షణలో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను

సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట : పాఠశాలలు, సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని రోలుగుంట ఎంపిడిఒ నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో జూనియర్ కళాశాల, రోలుగుంట జెడ్‌పి ఉన్నత పాఠశాల వద్ద, 19, 20 తేదీల్లో రోలుగుంట కెజిబివి, కుసర్లపూడి, బుచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వద్ద, 22న కొమరవోలులోనూ, 22 నుంచి 24 వరకు రోలుగుంట సచివాలయం, 23, 24 తేదీల్లో జె.నాయుడుపాలెం, రత్నంపేటలో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. ఆధార్ అప్‌డేషన్, సవరణలకు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు.

గ్రంథాలయంలో వార్షిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్‌జిఎస్ కార్యదర్శి కుమార్ రాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి కుమార్‌రాజు మంగళవారం సందర్శించారు. గ్రంథాలయానికి సంబంధించి 2024-25 సంవత్సరం వార్షిక తనిఖీ చేపట్టారు. పలు రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రంథాలయ అధికారి జనార్ధన్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎలమంచిలి గ్రంథాలయాధికారి వి. ఆనందరావు, పాయకరావుపేట గ్రంథాలయాధికారి వి. లక్ష్మణరావు, సిబ్బంది వి. రవణమ్మ పాల్గొన్నారు.

మినుము విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో జానకయ్యపేట గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు మంగళవారం మినుము విత్తనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా రైతులకు యూరియాను అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, మాజీ జడ్పిటిసి సభ్యులు కె నూకరాజు, జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ కురందాసు అప్పలరాజు, నాయకులు సింహాచలం, తులసీరావు పాల్గొన్నారు.

ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో

20న రోబో మ్యాథ్ ప్రదర్శన

ప్రజాశక్తి- అచ్యుతాపురం : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈనెల 20న ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఢిల్లీకి చెందిన రోబో సంస్థ ఆధ్వర్యంలో రోబో మ్యాథ్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో రోబో మ్యాథ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రదర్శనలో ప్రధానంగా ఆధునిక వైద్య వ్యవసాయం, రక్షణ రంగాల్లో రోబోల పాత్ర, ఏఐ కోడింగ్, ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ ఆఫ్ రోబోట్స్, 3 డి ప్రింటింగ్ తో రోబోట్లు తయారీ వంటి అంశాలు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ ప్రదర్శనను వీక్షించేందుకు హాజరు కావచ్చని తెలిపారు.

వృక్ష జీవ వైవిధ్యతను పరిరక్షించాలి

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : వృక్ష జీవ వైవిధ్యతను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎస్.దాస్ పేర్కొన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో 'భూగోళం పచ్చని వారసత్వాన్ని పరిరక్షించడం: వృక్షజీవవైవిధ్య పరిరక్షణ పాత్ర' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు.

భారత ప్రభుత్వ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, అంతరించే ప్రమాదంలో ఉన్న వృక్షజాలాన్ని సంరక్షించడానికి ఎయు చేస్తున్న కృషిని అభినందించారు. రానున్న శతాబ్దంలో అనేక వృక్ష జాతులు అంతరించే ప్రమాదం ఉందన్నారు. తూర్పు కనుమల్లో సైతం వృక్ష సంపద క్షీణిస్తోందని, ఇది ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. పట్టణీకరణ పేరుతో వృక్షాలను తొలగిస్తూ ముందుకెళ్లడం దీర్ఘకాలంలో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయన్నారు. యువతలో ప్రేరణ కలిగించే విధంగా ఇటువంటి సదస్సులను నిర్వహించాలన్నారు.



జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో బిఎస్ఐ శాస్త్రవేత్త, ఎయు విసి,

ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం వ్యవస్థలు, వ్యక్తులు నిబద్ధతతో కలిసి పనిచేయాలని సూచించారు. ఇటీవల కాలంలో ఇంటి మేడపై మిద్దెతోటల పెంపకం పెరుగుతోందన్నారు. ఆహార భద్రత, ఔషధ మొక్కల ప్రాధాన్యతను గుర్తించి పనిచేయడం ఎంతో ప్రధానమన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు జీవ, వృక్ష వైవిధ్యం, పరిరక్షణ తెలియజేసే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేసి నిర్వహించాలని కోరారు. ఎయు పరిశోధకులను బిఎస్ఐకి పంపడం, అక్కడ పనిచేస్తున్న శాస్త్రవేత్తలను ఎయులో పరిశోధన భాగస్వామ్యం చేయడం, బోధనలో భాగస్వాములను చేయాలని సూచించారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్.రాజు, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎస్.బి.పడాల్ మాట్లాడుతూ, ఎయులో 30కిపైగా అరుదైన వృక్ష జాతులను సంరక్షిస్తున్నామన్నారు. విభాగాధిపతి ఆచార్య డి.సంధ్య దీపిక విభాగ ప్రగతిని వివరించారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ ఎస్.ఎస్.దాస్‌ను విశ్వవిద్యాలయం తరపున సత్కరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం



మాకవరపాలెంలో సిఐటియు నేతల ప్రచారం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ మాకవరపాలెంలో కరపత్రాలను పంచుతూ ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. విరాళాలు సేకరించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె. ప్రసన్న, వజ్రపు సత్యవతి మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిరంతరం పోరాడే సిఐటియు అఖిలభారత మహాసభ తొలిసారిగా మన విశాఖలో జరుగుతున్నాయని, వాటి జయప్రదానికి అన్ని విధాలా సహకరించాలన్నారు సిఐటియు మహాసభలో భాగంగా వచ్చేనెల 4న విశాఖలో కార్మిక మహాప్రదర్శన, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగసభలో కార్మికులు, కర్షకులు,అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దండ్ల శివ, దమయంతి పాల్గొన్నారు



చీడికాడలో సిఐటియు పతాకావిష్కరణలో ఆశావర్కర్లు

★ పలుచోట్ల సిఐటియు జెండా ఆవిష్కరణలు

చీడికాడ : ఈ నెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు విశాఖలో నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు కె.కొండమ్మ మహిళా సంఘం నాయకురాలు ఆర్ మంగమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కోణాం పంచాయతీ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో



తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న మత్స్యరాజు

కార్మిక హక్కుల కోసం పోరాడే సంఘంగా ఆవిర్భవించిన సిఐటియు, ఐక్యత, పోరాటం నినాదంతో శ్రమజీవులు, కార్మిక వర్గం కోసం రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రపంచీకరణకు, ప్రైవేటీకరణకు, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగానూ, కార్మిక వ్యతిరేక చట్టాలు, లేబర్ కోడ్‌ల అమలును నిరసిస్తూ సిఐటియు పోరాటం చేస్తోంద న్నారు. అఖిలభారత మహాసభలో పెద్దఎత్తున కార్మికలోకం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దర్శన లక్ష్మి, అప్పల నరసింహమ్మ, చిన్న మ్ములు, పైడితల్లమ్మ పాల్గొన్నారు

గాజువాక : సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గాజువాక పరిధిలోని తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్‌లో జెండాను పి.మత్స్యరాజు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జె.రామన్న, కె.శ్రీనివాస్‌చౌదరి, ఎమ్‌వి.రమణి, యు.బొంజుబాబు, కామేష్, ఆర్.రమణి, మణి, పద్మ, జమున, అమ్మాజీ, లక్ష్మి, అరుణ, నిర్మల పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ బిసి గేటు వద్ద సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నమ్మి రమణ, యు.సోమేష్, ఎ.శ్రీను, బి.సింహాచలం, సురేష్, వివి.రమణ పాల్గొన్నారు.

మునగపాక : ఈనెల 31వ తేదీ నుండి విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్బిఐ సెంటర్ వద్ద మంగళవారం ఆయన సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ



మునగపాకలో సిఐటియు జెండా ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు పోరాడుతుందన్నారు. మహాసభలు సందర్భంగా విశాఖపట్నంలో జనవరి 4న జరుగు బహిరంగ సభకు పెద్దఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ఆదారి రామలక్ష్మి, అంజలి, జయలక్ష్మి, కోటేశ్వరి, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో ఫొటో ఎగ్జిబిషన్

పెదగంట్యాడ పరిధి పాత అయ్యన్నపాలెంలో ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, అభ్యుదయ గీతాలు, చిన్నపిల్లల కర్ర సాంగ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢనమ్మకాలపై చేసిన పలు కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ, సిఐటియు కార్మికుల పక్షాన నిరంతరమూ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డి.వెంకట్రావు, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి, జి.శ్రీనివాసరావు, జి.పెంటారావు, పి.మసేన్, సిహెచ్.రాముడు, బి.సింహాచలం, బిఎస్.ప్రసాద్, ఎ.శ్రీను, కణితి అప్పలరాజు, పాల వెంకయ్య, మల్లేష్, సురేష్ సన్యాసిరావు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



ఘంటానాదంతో ఉత్సవాలు ప్రారంభిస్తున్న ప్రధానార్చకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 1.24 గంటలకు నెల గంటతో ధనుర్మాసోత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, సంఘర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఘంటానాదం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం లక్కగరుడ వాహనంపై ఉభయదేవేరులతో శ్రీనివాసుని ఉత్సవమూర్తులను, పల్లకిలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను వేయించపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల 14వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు, ఈనెల 30 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు వెంకన్న అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా మాడ వీధుల్లో నెలరోజుల పాటు వాహన సేవలు నిర్వహిస్తారు. ఈ నెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి, జనవరి 14వ తేదీన గోదా రంగనాథుల కల్యాణం, 15 సంక్రాంతి, 16న కనుమ సందర్భంగా గిరి ప్రదక్షిణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థాన ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, కార్పెట్లు, పూల అలంకరణతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.కార్యక్రమంలో గోపాలచార్యులు, పవన్ తేజ, దేవస్థానం ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు, సందూరి వెంకట రాజగోపాల ఆచార్యులు, రేజేటి సింగరాచార్యులు ,నున్న సుభాష్, వైష్ణవ గోష్ఠి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

- సిఐటియు ఆధ్వర్యాన నిరసన
- పేదల పొట్ట కొట్టే సవరణ బిల్లును ప్రతిఘటించాలని పిలుపు

ప్రజాశక్తి-పరవాడ : ఎన్నో పోరాటాల ఫలితంగా దేశంలో గ్రామీణ పేదలకు కనీస ఉపాధిని గ్యారెంటీ చేయడానికి 2005లో వామపక్షాల ఒత్తిడితో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని ఒక సాధారణ సంక్షేమ పథకంగా మార్చి పేదల పొట్టకొట్టే చర్యలను ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మంగళవారం పరవాడలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నేటి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ స్థానంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీరామ్‌జీ) పేరుతో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు, పేరు మార్చడానికి మాత్రమే ఉద్దేశించింది కాదని, చట్టం పథకంగా మారనుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ పేదలు అనుభవిస్తున్న ఉపాధి హామీ హక్కు రద్దవుతుందని, ఇక నుండిఇ ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి ఉంటుందని తెలిపారు. కుటుంబానికి 100 రోజులు పనిదినాలు గ్యారెంటీగా కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు సగటున 50 పని దినాలు మాత్రమే కల్పించారని, చట్ట ప్రకారం పని కల్పించని రోజులకు నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉండగా, మోడీ ప్రభుత్వం దానిని ఎక్కడా అమలు జరపలేదని పేర్కొన్నారు. కోట్లాదిమంది పేదలకు సంబంధించిన ఈ చట్టాన్ని ఒకేసారి ఎత్తివేస్తే పెద్ద ఎత్తున తిరుగుబాటు వస్తుందని, అంచెలంచెలుగా ఎత్తివేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. అందులో భాగంగా కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి ఉద్దేశపూర్వకంగానే ప్రతిఏటా నిధులు తగ్గిస్తుందని తెలిపారు. ఈ కుటిలయత్నాలను కూలీలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.పోతి నాయుడు, ముత్యాలు, చిరంజీవి, రాముునాయుడు, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, కార్మికులు1

3,988 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పౌర సరఫరా సంస్థ ద్వారా 1428 మంది రైతుల నుంచి 9.46 కోట్ల రూపాయల విలువైన 3988 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1179 మంది రైతులకు 24 గంటల్లోపే 6.92 కోట్లు చెల్లించామని, మిగిలిన వారికి బ్యాంకు ప్రాసెస్‌లో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు గోనె సంచులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలు అందించామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు 80089001584ను సంప్రదించాలని కోరారు. జిల్లాలో 65 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యం అందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గర్భిణులకు ప్రత్యేక వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం హైమావతి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు సమీకృత అధిక ప్రమాదకర సమస్యలు గుర్తించుట నిర్వహణపై శిక్షణ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు వచ్చే సమస్యలు ముందుగానే గుర్తించి వైద్యం అందించాలని, ప్రమాద లక్షణాలు గల గర్భిణుల పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి తగు వైద్యం అందించాలని డిఐఒ కె చంద్రశేఖర్ దేవ్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్సిడి సిడిపిఒ ఎస్పేరు రాణి, చోడవరం సిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ విష్ణు ప్రియ, ఆర్మస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది డాక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.